# ★ 'అనుమానం' ★

శ్రీ సామవేదుల సీతారామశాస్త్రి

(సెప్టెంబర్ సంచిక తరువాయి)

అవధానిగారు, సోమయాజులుగారు, పూజారి రామన్న.

కోమటి సత్యం, సోమన్న, సుబ్బయ్య అందరూ వచ్చేరు పరుగెత్తుకొని; చాలామంది ఆడవాళ్ళుగూడా వచ్చేరు. వారిపేర్లు నాకు తెలియవు. సంగతి గ్రహించేరు. వెంకన్న దౌర్జన్యానికి కోపగించేరు. పిచ్చయ్య దౌర్భాగ్యానికి విచారించేరు. సుశీలాదేవి సాహసానికిమాత్రం అందరూ నోర్లుతెరిచి. కళ్ళు పెద్దవిజేసి ఆశ్చర్యపోయేరు. "ఇంత చిన్నతనంలోనే నీ కెంతటికష్టం వచ్చిందిరా" అని అవధానిగారితల్లి వాపోయింది!

"ఆవెంకన్న సామాన్యుట్టే! ఒకమాటు మేం స్నానం చేస్తూంటేవచ్చి, కరణంగారికోడలు చెయ్యపట్టుకున్నాడు" అని రహస్యంగా చెప్పిం దందరికీ ఒక అరవై యేళ్ళ ఆడ బిడుచు—"ఆఁ, ఏమీ లొసుగు లేకపోతే అంత పల్లిగ్గా ఎలా పట్టుకోగలడు ఎవడేనా" అని సమర్థించింది ఒక పదహారేళ్ళ పతివ్రత కళ్ళజోడు సర్దుకుంటూ—

అందరికీమాత్రం పిచ్చయ్యగారిభార్య ఒక సమస్య అయిపోయింది. "ఈపాటికి వారిద్దరూ పారిపోయేఉంటారు" అని ఎవరో అన్నారు. ఆ రోడ్డుమీంచే ఏదో జట్కా వెళ్తుంటే చూసేనని ఒక స్కూలుకుర్రాడు అన్నాడు. పిచ్చయ్య నిలువునా కూలిపోయేడు. స్త్రీ పురుష విచక్షణ లేకుండా అందరూ అతనిసపర్యలు చేస్తున్నారు. ఎందుకేనా మలచిది, పలుగురువెళ్లి వీధిగుమ్మందగ్గర కాపుండండి, పైనమాత్రం గొళ్లేలు పెట్టిఉంచండి" అని కొంత మందిని సోమయాజులుగారు పంపించేరు. చేయవలసినపని తొందరగా చేస్తేనేగాని పిట్ట చేతిలోంచి జారిపోతుందని అందరూ చెప్తుతున్నారు. కాని ఏం చెయ్యడమో ఎవ్వరికీ తెలీడంలేదు. వెంకన్నకు ఎదురుచెప్పి నిలవగలగడం కలలోనివార్త. పోలీసు సబిన్స్పెక్టరుకి కబురుపెట్టి పిలిపించేరు. పిచ్చయ్య అతనికాళ్ళమీదపడి. "మీరే తల్లిదండ్రులు. నా తల్లితండ్రులు నాకు పెళ్ళిచెయ్యకుండానే చచ్చేరు, నాచేత్తో చేసుకున్న మూడుపెళ్ళిళ్లు మూడువిధాలుగా మారేయి. ఈమారేనా మీరు నాపెళ్లాన్ని నాకు దక్కించి నా ప్రాణాల్ని నిలపండి. నావంశాన్ని కాపాడండి. మీమేలు మరిచిపోను. మీపేరు చెప్పుకుంటాను. ఆ వెంకన్నకు గడ్డిపెట్టండి" అని వేడుకున్నాడు. సబ్ఇన్స్పెక్టరు మనసు కరిగింది. ఆమనస్సు ఈయన ప్రార్థన వల్లనే కరిగిందో, పిచ్చయ్య అనుజ్ఞమీద కరణంగారు అతనిచేతిలోపెట్టిన పదిహేనురూపాయీల తాకుడువల్లే కరిగిందో చెప్పలేముగాని. ఆయనహృదయంమాత్రం నీరయిపోయింది. ఇతని అవస్థచూసి—"ఆ వెంకన్నను ఈ జిల్లాలోనే ఉంచను. నామజా చూపిస్తాను. ఏమిటను కున్నాడో. పొద్దున్ననుంచి కనుబించకపోతే ఏమిటో అనుకున్నాను, ఇదా సంగతి! ఇటువంటి పోకిరీవెధవని నాకు తెలీదు. మీరుమాత్రం అందరి సంతకాలతోటీ ఒక ముక్క అంటించండి. పదండి ఇంటికి" అన్నాడు సబ్ఇనస్పెక్టర్. వెంకన్న ఏ కొత్తపిట్టను పట్టినా సబ్ఇన్స్పెక్టర్నిగూడా సంతోషపెట్టడం అలవాటు. కాని ఈ విషయం తనదాకా రాకుండా జరిగిపోతున్నందుకు సబ్ఇన్స్పెక్టరుకి నిజంగా కోపంవచ్చింది.

అందరూ పిచ్చయ్యఇంటికి వచ్చేరు. సబ్ఇనస్పెక్టర్ కనిస్టీబుల్ని తీసుకురాకపోడంవల్ల అక్కడ చేరినవారిలోనే కొంతమందిని కాపలాకి సర్దేడు. కోమటి సత్యాన్ని పెరటిగుమ్మానికి అడ్డుగా నిల్చోమన్నాడు. అతను వెనుకనుండి తొయ్యబడకుండా సుబ్బయ్యని, సోమన్నని దన్ను పెట్టేడు. గోడకి గాజుపెంకులుండడం వలన, పెరటికి తీగె ఫెన్సింగు ఉండడంవలన అంతప్రమాదం లేదనుకున్నాడు. ఎవరూ దాటిపోకుండా చూడడానికిమాత్రం ఇద్దరు స్కూలుకుర్రాళ్ళని పెట్టేడు. మిగిలిన వాళ్ళందతో తచు వీధిగుమ్మంముందు చేరేడు.

ఇంతలో ఆడవాళ్ళందరూ కిటికీదగ్గరచేరి లోపలకు చూస్తూ, మాటలువింటూ ఆనందిస్తున్నారు. ఆ ఆడవాళ్ళ కంటే ఎక్కువ అవస్థ పడిపోతూ కిటికీవద్దకు రాలేని మగవాళ్ళు, ఆడవాళ్ళు అనుకుంటున్న మాటలనుబట్టి లోపలిసంగతులు ఊహించుకుంటున్నారు. లోపల ప్రేమి కులమాటలు స్పష్టంగానే వినిపిస్తున్నాయి. అందులో ఒక రికో ఇద్దరికో చెముడై ఉండాలి!

"మొన్న కరణంగారి కోడలికి నేనే చేసేను—ఆ అమ్మాయికి నేనంటే ఎంత మమకారమనుకున్నావు? ఆ మొగుడు వట్టి మొద్దువెధవ! ఇరవై నాలుగుగంటలూ వీధి అరుగుమీద పడుక్కుంటాడు. ఇంట్లో, అత్తగారు లేని ఆడది ఏం అవస్థ పడుతుందో అన్న ఇదిలేదు" అని హెడ్డు వెంకన్న గొంతుక స్ఫుటంగా వినిపిస్తోంది.

"నేం చెప్పలేదూ, ఏలొనుగూ లేకపోతే ఎందుకలా చెయ్యి పట్టుకుంటాడు" అని కళ్ళజోడు పతివ్రత సవాలు చేసింది. ఈవిషయం వెంటనే మగవారికి చేర్చబడింది. కరణంగారు వెంటనే తనయింటికి పరుగెత్తేడు, తన కోటలుసంగతి కనుక్కొందికి.

"అంతేనండీ, పెళ్ళాదేవరకే భర్తలకి శ్రద్ధ-ఆతర్వాత పెట్టేబాధలకి అంతుండదు. నేను అనుభవిస్తున్నామ కదూ! ఏదో ఇవేళ మీరు వచ్చేరుగాబట్టి మీతో మనసు విప్పి మాట్లాడుతున్నాను. ఒక మంచిమాటకు వాచిపోయే నంటే నమ్మండి. ఒక లాలనలేదు. ఒక పాలనలేదు" అని సుశీల తనకష్టాలు జెప్పుకుంటోంది.

కిటికీదగ్గర ఆడవాళ్ల కళ్ళు పెద్దవయ్యాయి. ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకొని ముసిముసినవ్వులు నవ్వు కున్నారు. అవధానిగారితల్లికీ కిటిదగ్గరకువచ్చి గుండె బాదుకుంటూ—"ఎంత నేర్చుకున్నాదే అమ్మాయి!.... ఎంత రసికత్వం నేర్చిందే! ఎంత వగలాడి....ఇదేం పిల్ల లమ్మా ఈకాలంవారు" అని ఆశ్చర్యపోయింది. లోపల జరుగుతున్నవిషయాలన్నీ తను చూసినట్టు ఈవిధంగా చెప్పడం మొదలుపెట్టింది—"ఇంకేం ఉందిరా నాయనా. అది వాడి వొళ్ళోకూర్చొని కులుకుతూఉంటే, దానికి బుంగమీసాలంటే సరదాటరోయ్! నువ్వు మూతిమీద మీసమేనా ఉంచవు, దానికి క్రాఫింగుమీదికి మనసు పోతూంటే నీ బోడిగుండుమీది పిలకేం రుచిస్తుందిరా దానికి....అది, వాడు మంచంమీద పడుక్కుంటుంటే ఈకళ్ళతో చూసేనురా పాపిష్టికళ్లు" అని గగ్గోలుపెట్టడం మొదలుపెట్టింది. ఈవిషయాలేం కనుపించని మిగిలిన ఆడవాళ్ళు ఆవిడకు దివ్యదృష్టి ఉందనుకున్నారు.

పిచ్చయ్య మరోమాటు సబ్బినస్పెక్టర్ కాళ్ళమీదపడి, ఇంకేం మించిపోకుండా, తనవంశాన్ని నిలబెట్టమని చెప్పేడు....సబ్బినస్పెక్టర్ దయామయుడే గాబట్టి ఈ ప్రార్థనకేం మళ్ళా ఛార్జి చేయలేదు.

పిచ్చయ్యశాస్త్రి అనుమతిమీద సబ్బినస్పెక్టర్ తలుపు కొట్టేడు. ఎప్పటికీ ఎవ్వరూ రాకపోడంవల్ల మరింత గట్టిగా తలుపుకొడుతూ—"వెంకన్నా, వెంకన్నా" అని పిలిచేడు, లోపలినుంచి 'ఎవరూ' అని సుశీల పలికింది. వెంటనే పిచ్చయ్య తనకోప మంతటితోను—"ఎవరేమి టే రండా! పలుపు తియ్యమంటే" అని అరిచేడు.

"ముసలాడు వచ్చేడుగా మోసు పిల్లా, అతనిదే ఆ గొంతుక" అని బొంగురుగొంతుక మాట్లాడింది—హెడ్డు వెంకన్న తన పెళ్ళాంముందు తనను ముసిలివా డన్నందుకు పిచ్చయ్య మకీ వణకిపోతున్నాడు, రెండు పిడికిళ్ళు బిగబట్టి, ఒక్క ఎగురుఎగిరి, "ఏం తియ్యవేం" అని ఒక సుగ్రీవబొబ్బ పెట్టేడు. లోపల ఏదో అలికిడి అవుతోంది...."వెధవని దాచపెడుతోంది గామోసు" అన్నాడు సబ్బినస్పెక్టరు తన అనుభవాన్నంతనూ వ్యక్త పరిచేటట్టు నవ్వుతూ—

"ఆ—దాస్తుంది!....ఇంతవరి తెగింతర్వాత దాస్తేమా త్రం దాగుతుందేమిటి?" అన్నాడు పిచ్చయ్య. ఇంత మంది మగవాళ్ళున్నతర్వాత ఇప్పుడు తనేమన్నా భయం లేదన ధైర్యంతో—

"ఆగండీ, తొందరేమిటి" అంటోంది సుశీల లోపల నుంచి.

"అమ్మ, ఎంత వగలాడి, ఎంత సాహసం, మొగుడు వీధిగుమ్మంలో నిలుచున్నా దాని ధైర్యంచూడు. ఎంతలా ఎదిరించి మాట్లాడుతోందో, చూడు" అని అవధానిగారి తల్లి కళ్ళజోడు పిల్లతోచెప్పి బుగ్గలు నొక్కుకుంటోంది!

"తొందరంటావేమిటే లంజా, రంకుమొగుడుతో కులుకుతూ" అని తలుపుని ఒక్కతన్ను తన్నేడు. ఆ గొళ్ళేనికి పట్టు లేకపోడంవల్ల, తలుపు భళ్ళున తెరచుకొంది. లోపలికి ఒక్కసారి పిచ్చయ్య, సబ్బినస్పెక్టరు, సోమయాజులు, అవధాని మొదలైనవారు ప్రవేశించేరు. సుశీల పడకగది గుమ్మందగ్గరకొచ్చి, ఇంతమంది ఒకేసారి రావడంచూసి—"అయ్యో ఇదేం దౌర్జన్యం, తలుపు తియ్యకుండా వస్తారేమిటి ఇలా! ఆగమంటే ఆగకుండా" అంటూ పడకగదికి అడ్డుగా నిలుచుంది. వెనకాల అందరూ ఉన్నదీ, లేనిదీ మరోమాటు చూసుకొని, పిచ్చయ్య ముందుకొచ్చి—"ఏం, అడ్డు లేస్తావా. లేవవా?" అని గర్జించేడు, సుశీల తెల్లముఖం వేసింది. తన తప్పు నలుగురికీ తెలిసిపోయిందనో, లేక ఇంతమంది మగాళ్ళతో వచ్చిన భర్త తన్నావిధంగా గదమాయించడం వల్లనో, పాపం ఇల్లాలు బిక్కచచ్చిపోయింది. ఒళ్ళు వణికిపోతోంది. కాళ్ళు గజగజ లాడిపోతున్నాయి. అలాగే నిలుచుంది.

"ఏం చెప్తే నీక్కాదు" అని పిచ్చయ్య రెండడుగులు ముందుకు వేసేడు, "ఆగండీ, లోపలకు రావడానికి వల్లకాదు" అన్నాది సుశీల ఎదుపుముఖంలో. "ఎందువల్ల కాదే, లంజా" అని పిచ్చయ్య ఇంకా సుశీలదగ్గరకు వచ్చి, సుశీల జబ్బ పట్టుకొని యీడ్చేశాడు.

"వంటయింటి తలుపులేనా వేసుకోండీ, వీళ్ళు వస్తున్నారు" అని అరిచింది సుశీల ఇక చేసేదిలేక: వంటయింటిలోకి ఎవరో పరిగెట్టినిళ్ళి లోపల తలుపు దడాలున వేసుకొని గొళ్లెం పెట్టుకున్నారు.

"ఎంత ఆడదయినా ఇంత సాహసం పనికిరాదు" అన్నాది అవధానిగారి తల్లి"—అయినా ఇంత పల్లిగ్గానా" అని విచారించింది, కళ్ళజోడు కాంతారత్నం—ఇంతకీ హెడ్డు వెంకన్నకి చెడ్డరోజులు వచ్చేయి అనుకుంటున్నారు.

పిచ్చయ్యని నిజంగా అప్పుడు చూడాలి. ఆంజనేయుడు తోక కాలినప్పుడేనా యింతలా గెంతి ఉండడు. వీరభద్రుడు దక్షయజ్ఞంనాడేనా యింతగా విజృంభించి ఎరగడు. కోపం మనిషిని ఎలా ఆడించగలదో తెలుసుకోవాలంటే ఆనాడు పిచ్చయ్యశాస్త్రిగారిని చూడాలి. "ఏయ్ రండా, ఎవర్నే లోపలపెట్టుకు కులుకుతున్నావ్! ఎప్పట్నుంచీ వాడి సావాసం. ఏం చెస్తావా, చెప్దూ లెక్కలాగేమన్నావా? ఊ, తలుపు తియ్యమను" అని ఎగిరిపోతున్నాడు.

"ఏమిటే పిల్లా ఆ అల్లరి" అని వంటిట్లోంచి ప్రశ్న.

"వంటింటి తలుపులు తొందరగా తియ్యాలి" అని సబిన్స్పెక్టరు తన హోదాకు తగినట్టు ఆజ్ఞాపించేడు.

"చిన్న గావంచా కట్టుకున్నానని చెప్పలేకపూయేవ్" అని వంటింట్లోంచి వెంకన్న గొంతుక వినిపించింది.

"చిన్న గావంచా కట్టుకున్నాట్ట!" అని కళ్ళజోడు వనిత అవ్వగారితో అంది,

"చిన్న గావంచాయేనా కట్టుకుంటాడు; ఇంకేమేనా కట్టుకుంటాడు, వాడికేం, వాడిరాజ్యం లాగ వెలుగుతోంది" అన్నాది అవధానిగారి తల్లి—"అది కాదు చూడండి! ఆ చెప్పడానికి ఎంత సిగ్గులేదో అంటా" అన్నాది ముక్కద్దాల చక్కనిచుక్క తగు సిగ్గుపడుతూ.

తన మాటనేనా వినకుండా వెంకన్న ఆవిధంగా ప్రవర్తించడంవల్ల సబిన్స్పెక్టరుకి కోపం వచ్చింది. "ఏం తలుపు తీస్తావా? పగలగొట్టేమన్నావా?" అన్నాడు గట్టిగా.

ఇంక తను ఆ వంటయింటిలోని మనిషిని రక్షించలేనని నిరాశ చేసుకుంది సుశీల, ఇంక గత్యంతరంలేదు. విషయం ఇంత క్లిష్టమైన పరిణామానికీ వచ్చింతర్వాత తను ఎంతకని భరించగలదు! ఇక ఏదానికేనా దేవుడే దిక్కని—"ఆ కొయ్యనున్న మా ఆయన మడిపంచె కట్టుకొని తలుపుతియ్యండి" అని సలహా ఇచ్చింది. "ఎంత దౌర్జన్యం! నీ రంకుమొగుడికి, నా పంచే కావలవచ్చిందటే" అని ఉరిమేడు పిచ్చయ్య. "ఏవిధంగానేనా మొగుడేకదా" అని కిలకిలమంది కళ్ళజోళ్ళ కలకంఠి,

"నేను తలుపు తీస్తున్నాను నాకుమాత్రం దోవ ఇచ్చేయండి, లేకపోతే మాట దక్కదు" అని వంటింటిలోంచి వెలువడినవి హెడ్డుగారి కఠోర కర్కశ స్వరం ఇంటి

వంతనీ దద్దరిల్లజేసింది. ఎందుకేనా మంచిదని సోమయాజులు, అవధాని ప్రక్కకు తప్పుకోబోయేరుగాని. సబిన్స్పెక్టరు వాళ్ళని ఆపి, ఆ వ్యక్తి రాగానే చెరివకడూ చెరో బుజం పట్టుకోవలసిందిగా ఆజ్ఞాపించేడు. తను గుమ్మానికెదురుగుండా కాళ్ళు ఎడంగా పెట్టి ఫుట్‌బాల్ దగ్గరపడుతుంటే గోలరు నిలుచుండే విధానంలో నిలుచున్నాడు. పిచ్చయ్యని వెనకాపు ఉండమన్నాడు. ఇక వెంకన్న పారిపోలేడనుకున్నాను, ఈనాటికి, ఈ ఊరికి వెంకన్న అనే శని విరగడైపోతుందని అవధానిగారి తల్లి సంతోషించింది. ఎంత జమాదట్టీ అయినా ఇంత పబ్లిక్కు వ్యవహారం పెట్టుకోడం తప్పవని చేసేమని మనస్సులోనే విచారించింది చతురాక్షి—కళ్ళ నీళ్ళుగూడా కార్చిందేమో. ఫేముల మధ్యనున్న గోళీకాయలలోంచి కనపించింది కాదు.

"ఇంక తలుపు తియ్యవచ్చు" అన్నాడు సబినస్పెక్టరు. దభేలున తలుపు తెరుచుకుంది. ఒక మహాపర్వతం ఆ ద్వారంలోంచి వెర్రిఏనుగు వేగంతో వెలువడింది. పట్టుకుందికి ప్రయత్నించిన సబిన్స్పెక్టరు గోళీకాయలా ఎగిరి గోడకు గుద్దుకున్నాడు. చేతులు పట్టుకుందికి ప్రయత్నించిన దండద్వయం పక్షుల్లా ఎగిరిపోయారు. వెనుకదాపు ఉన్న పిచ్చయ్య అగ్గిపుల్లలా ఎగిరి సుశీల ఒళ్లో వాలేడు. ఎంత బలవంతుడు వెంకన్న!

ఆ మహాపర్వతం ఆగి, రెండుచేతులూ నడుంమీదచేర్చి "ఏమిటీ హడావుడి" అని అక్కడున్న వారినందరినీ ఉరుము ఉరిమినట్లు ప్రశ్నించింది. అయిదునిమిషాలకు అందరూ తెప్పరిల్లి ఆ వ్యక్తిని పరిశీలించేరు. ఎవరిది! ఎవరైతేనేంగాని, ఆమనిషి వెంకన్నకాకపోవడం అందరికీ నిరాశ అయింది. ఆ బుగ్గమీసాలూ లేవు, ఆ కత్తాళులూ లేవు, చేతిని గోడ గడియారయగూడా లేదు. అంతేకాక, అంత ఒడ్డూ, పొడుగూ కలిగి, నలుకొరు మొగాళ్ళను విసిలేసిన మనిషి కనీసం మొగాడయినా కాకపోడం అక్కడున్నవాళ్ళకు సిగ్గనిపించింది. అందరికంటే ఆ ఎరుపుకళ్ళ కలహకంటి అనుభవించిన ఆశాభంగానికిఅంతులేదు.

మర్రికొమ్మలలాంటి తన బాహువులలో తళతళలాడుతున్న తన నగ్నసిరస్సుమీద ధవళవస్త్రాన్ని సరిచేసుకుంటూ, ఆ పర్వత స్వరూపి, ఇంతమంది మగాళ్ళమధ్య ఎటుపోవడానికీ త్రోవలేకుండా చిక్కుకోడం గ్రహించి స్త్రీ సహజమయిన లజ్జా భయాలతో వణికిపోతూ ఖిన్న వదనయై—"ఆడదాన్ని ఒక్కర్తినిచేసి ఆటలాడిస్తారా" అని పదిమంది మగాళ్ళ గొంతుకతో బొరుమంది.

ఆవిడ స్వయంగా. "నేను ఆడదాన్నేనర్రా" అని ఎలుగెత్తిచెప్పుకున్నా, తన మేనకోడలయిన సుశీలను చూడడానికి ఆ ఉదయమే వచ్చినట్లు ఎంతగా మొరబెట్టుకున్నా పిచ్చయ్యకు అనుమానం తీరలేదు. అవధానిగారి తల్లి సులోచనాల సుందరాంగీ వేరువేరుగాను, ఇద్దరూ కలిసిగూడా, అన్నికోణాలనుంచి వ్యక్తిని పరిశీలించి, "అది ఆడదే అని తీర్మానించారు.

"ఇదేం మగాళ్లమ్మా, ఈకాలం మగాళ్ళు. ఇంత అనుమానం సంకటాలు! నిప్పుల్లాంటిపిల్ల ననుమానించడం ఇదేం తెగులమ్మ! ముసలికాలంలో పెళ్ళాడితే, ఇదే బాధనా తల్లీ! నా సుశీలమా నీ కెంతకష్టం వచ్చిందే నీకు రంకుకట్టినవాళ్ళు తలపగిలి చచ్చిపోరటే, నా కన్నతల్లీ ఈ అనుమానపు పీనుగుతో నువ్వేలా వేగగలవే" అని అవధానిగారి తల్లి సుశీల మేనత్తతో కలిసి ఏక కంఠంలో అనేక కంఠాలు మేళవించి రాగం ప్రారంభించేరు.

ఆ సాయంత్రంలోపున పిచ్చయ్యశాస్త్రిగారి ఇంటిలో దూరిన వెంకన్న, మొగవెంకన్న కాదనీ, సుశీల మహాపతివ్రత అనీ, ఆ ఊరంతా వెల్లడయినప్పటికీ పిచ్చయ్య అనుమానం తీరలేదు.

మరునాడు కేంపునుంచివచ్చిన హెడ్డు వెంకన్న ఊళ్లో జరిగిన భోగట్టా విని పిచ్చియ్య శాస్త్రిమీద మాననష్టం దావా తెస్తానని బెదిరించేడు. పిచ్చయ్య ఎంత బతిమాలినా ఒప్పరునన్నాడు. ఇద్దరు ముగ్గురు మధ్యవర్తులద్వారా, వెంకన్న పిచ్చయ్యలమధ్య అతి కష్టంమీద కొన్ని షరతులతో రాజీ కుదిరింది. ఆ తర్వాత ఎప్పుడూ పిచ్చయ్యశాస్త్రిగారి ఇంటిలో వినుపించే గొంతుకలు ఎవ్వరికీ అనుమానం కలిగించేవి కావు. ఏడాదికాకుండా పిచ్చయ్యశాస్త్రిగారికి (యింత ముసలికాలంలో గూడా) సుపుత్ర లాభం కలిగినందుకు ఆబాలగోపాలం సంతోషించేరు. ఎప్పుడో వెంకటేశ్వరుల మొక్కు ఉన్నాదవి సుశీల పట్టుబట్టి తన వమార్థరత్నానికి 'వెంకన్న' అన్న పేరే పెట్టించింది. పిల్లాడి గొంతుక తనగొంతుకలాగే వుంటుందని, సుశీల మేనత్తకి మాత్రం ఆ పిల్లడంటే తీరని ప్రేమ.